క్లుప్తంగా

టగ్ ఆఫ్ వార్ పోటీలు



పర్వతగిరి : మండల కేంద్రంలోని పర్వతాల శివాలయ కమిటీ సభ్యులు శనివారం టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి కల్లెడ, రెండో బహుమతి నారెంగతండా, మూడో బహుమతి రోళ్లకల్, నారాయణపురం గ్రామాలు సాధించాయి. ఈ సందర్భంగా పర్వతాల శివాలయ కమిటీ సభ్యులు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

‘ఆరోపణలు సరికాదు’



రాయపర్తి: కాంగ్రెస్ పార్టీకి వస్తున్న జనాదరణ భరించలేని బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి ఒక వ్యక్తి మృతిపై నిరాధరణ ఆరోపణలు చేయడం తగదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాతోతు హామ్యా నాయక్ అన్నారు. శనివారం రాయపర్తి మండల పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకుర్తిలో రేవంత్ రెడ్డి సభ జరిగిన రోజున మండలంలోని కిష్టపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ముద్రబోయిన యాకయ్య రోడ్డు ప్రమాదంలో చనిపోతే వక్రీకరిస్తూ కాంగ్రెస్ పార్టీ పై బురద చల్లే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. పార్టీ కార్యకర్తపై నిజమైన ప్రేమ ఉంటే అతని కుటుంబానికి లబ్ధి జరిగేలా చూడాలని హితవు పలికారు. రోడ్డు ప్రమాదం చేసింది సైతం బీఆర్ఎస్ వాళ్ళే కావడంతో లోలోపల సెటిల్‌మెంట్ చేసింది నిజంకాదా అని సవాల్ విసిరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సరికొండ కృష్ణారెడ్డి, మురళి, యాదగిరి, ఎల్లయ్య, బాబు, మహేందర్, మహమూద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడి మృతి



వర్ధన్నపేట: మండలంలోని నల్లబెల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు అంబాల రాములు(63) వృత్తిలో భాగంగా శుక్రవారం తాటి వనానికి వెళ్లి చెట్టు ఎక్కుతుండగా కింద పడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెట్టుపై నుంచిపడి అపస్మారక స్థితిలో ఉన్న రాములును 108లో వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. రాములుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బీజేపీ ప్రచారం

పర్వతగిరి: రజాకార్ల పాలన చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం వల్ల ఎంతో నష్టపోయామని వర్ధన్నపేట బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొండేటి శ్రీధర్ అన్నారు. మండలంలోని అనంతరం, గోపనపల్లి, కొంకపాక, జమాల్‌పూర్, సోమారం గ్రామాల్లో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాజేశ్వర్‌రావు, కుడికాల శ్రీధర్, తిరుపతిరెడ్డి, సాంబయ్యయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత ఆలోచనలు కలిగి ఉండాలి

కాజీపేట రూరల్: విద్యార్థులు ఉన్నతంగా ఆలోచించడం అలవర్చుకున్నప్పుడే ఉన్నతంగా ఎదుగుతారని హనుమకొండ సీడబ్ల్యూసీ మెంబర్, మోటివేషనల్ స్పీకర్ కే.దామోదర్ అన్నారు. కాజీపేట బాపూజీనగర్‌లోని విజేత స్కూల్‌లో శనివారం జరిగిన సంస్కార వికాస శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు సహ విద్య కార్యక్రమాలు క్రీడలు, సాంస్కృతిక, క్విజ్, తదితర పోటీల్లో పాల్గొని రాణించాలని సూచించారు. విజేత స్కూల్ హెడ్‌మాస్టర్ బండి కల్పన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగేందర్, స్కూల్ కరస్పాండెంట్ బండి ప్రదీప్, వీరన్న, కుమారస్వామి, ఝాన్సీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లల ఇష్టాలను తల్లిదండ్రులు గుర్తించాలి

ఖిలా వరంగల్: పిల్లల ఇష్టాలను తల్లిదండ్రులు గుర్తించి ఇష్టమైన రంగంలో వారు రాణించేందుకు దోహదపడాలని ట్రస్మా జిల్లా ప్రతినిధి, వందన హైస్కూల్ ప్రిన్సిపాల్ ఆడెపు శ్యాం సుందర్ సూచించారు. ప్రకృతిలో లభించే పలు రకాల పండ్ల విశిష్టతపై చిన్నారులకు అవగాహన కల్పించేందుకు ఫ్రూట్స్ డేను ఉపాధ్యాయులు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. వరంగల్ శివనగర్‌లోని వందన హైస్కూల్‌లో పాఠశాల కరస్పాండెంట్ విజయ కుమారి ఆధ్వర్యంలో ఫ్రూట్స్ డేను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవచ్చని చెప్పారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



నర్సంపేట: పార్టీలో చేరిన వారితో సుదర్శన్‌రెడ్డి



నల్లబెల్లి: బతుకమ్మలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

- పార్టీ నర్సంపేట అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆపార్టీ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు నర్సంపేట పట్టణంలోని 13వ వార్డు కాంగ్రెస్ పార్టీకి చెందిన 30కుటుంబాలు నర్సంపేట మండలం మాధన్నపేట గ్రామ కాంగ్రెస్ పార్టీకి చెందిన 20కుటుంబాలు, ఖానాపురం మండలం అశోక్‌నగర్‌కు చెందిన 30కుటుంబాలు శనివారం పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరాయి. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, పార్టీ క్లస్టర్ బాధ్యులు నల్లా మనోహర్‌రెడ్డి, బండి ప్రవీణ్, బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ కన్వీనర్ రాణాప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

మాయ మాటలకు మోసపోవద్దు

నల్లబెల్లి: ఇన్నాళ్లు పత్తాలేకుండా పారిపోయి.. ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు గ్రామాలకు వచ్చి చెప్పే మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. నల్లబెల్లి మండలంలోని పొచంపల్లి బద్దిపోచమ్మ తల్లి దేవాలయంలో పెద్ది ప్రత్యేక పూజలు నిర్వహించి రెండో విడత ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. పొచంపల్లి, బోల్లోనిపల్లి, రాంతీర్థం, అర్షనపల్లి, బుచ్చిరెడ్డిపల్లి, కన్నారావుపేట, అర్వయ్యపల్లి, బిల్‌నాయక్‌తండా, శనిగరం, రుద్రగూడెం, చిన్నతండా, పెద్ద తండా, బజ్జుతండా, నారక్కపేట గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించగా.. మహిళలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున బతుకమ్మలు, బోనాలతో స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ దండగా.. మూడు గంటలే చాలని చెప్పుతున్న కాంగ్రెస్ నాయకులకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. కన్నారావుపేట, బుచ్చిరెడ్డిపల్లి, పద్మాపురం గ్రామాల రైతులకు పూర్తి స్థాయిలో పట్టాలు ఇప్పించి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఊడుగుల సత్యనారాయణ గౌడ్, జెడ్పీ ఫ్లోర్ లీడర్ స్వప్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, ఎన్నికల ఇన్‌చార్జ్ మురళీధర్, ప్రవీణ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, హరినాథ్ సింగ్, శ్రీనివాస్ గుప్తా, ప్రతాప్ సింగ్, శివాజీ పాల్గొన్నారు.

‘పెద్ది’ని అధిక మెజార్టీతో గెలిపించాలి

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని ఆర్‌పీఐ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీకి రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా సంపూర్ణ మద్దతు ఇస్తుందని అన్నారు. మహ్మద్ రఫీ, సర్పంచ్ మల్లయ్య, సతీష్, రమేష్ పాల్గొన్నారు.

గ్యాస్ బండ.. నీటి కుండ

- సిలిండర్‌లో కనిపించిన నీరు
- డిస్ట్రిబ్యూటర్ నిర్లక్ష్య సమాధానం



గ్యాస్ సిలిండర్ నుంచి బయటకు వస్తున్న నీరు

సంగెం: వంట గ్యాస్ సిలిండర్‌లో నీరు వచ్చిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. తీగరాజుపల్లి గ్రామానికి చెందిన మోడెం కోమలత ఈ నెల 1న అదే గ్రామంలోని సాయిచైత్ర ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో సిలిండర్‌ను తీసుకుంది. శనివారం ఉదయం ఎప్పటిలాగే వంట చేస్తున్న క్రమంలో మంట ఆరిపోయింది. దీంతో మరోసారి అంటించినా మంట రాలేదు. 10 రోజుల్లోనే గ్యాస్ ఎలా అయిపోతుందని బయటకు తెచ్చి ఇరుగుపొరుగు వారికి విషయం చెప్పింది. గ్యాస్ సిలిండర్ కదిపి చూడగా నీరు ఉన్నట్లు శబ్దం వచ్చింది. టెస్టర్ సాయంతో వాచర్‌ను నొక్కడంతో నల్లా నీరులాగా వచ్చింది. స్థానికులతో కలిసి కోమలత భర్త వెంకటేశ్వర్లు వెళ్లి డిస్ట్రిబ్యూటర్‌ను అడిగాడు. మాకు తెలియదని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై డిస్ట్రిబ్యూటర్ స్వప్నను వివరణ కోరగా గ్యాస్ సిలిండర్‌లో నీరు ఎందుకు వచ్చిందో మాకు తెలియదు. కంపెనీకి విషయం తెలిపి వినియోగదారుడికి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

ఆల్ఫోర్స్ స్కూల్‌లో దీపావళి వేడుకలు

వర్ధన్నపేట: ఆల్ఫోర్స్ పాఠశాలలో శుక్రవారం బాలబాలికలతో ఘనంగా దీపావళి వేడుకలు నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాల బాలికలు సత్యభామ, శ్రీ కృష్ణుడు, నరకాసురుడు వేషధారణతో ఆహుతులను ఆకట్టుకున్నారు. శ్రీకృష్ణార్జునుల యుద్ధ ప్రదర్శన ఆకట్టుకుంది. కాలుష్యాన్ని నివారిద్దాం- ప్రకృతిని కాపాడుదాం, చేద్దాం ఈ దీపావళిని స్వచ్ దీపావళి అనే నినాదంతో విద్యార్థులను చైతన్య పరిచారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సృజనోత్సవాలకు సిద్ధార్థ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న గోపాల్‌రెడ్డి

చెన్నారావుపేట: మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు సృజనోత్సవాల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో శనివారం విద్యార్థులను ఆయన అభినందించి, మాట్లాడారు. పాఠశాలకు చెందిన మాలోతు తరుణ్‌కుమార్, బీ.శివానంద్ ఈ నెల 10న వరంగల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సృజనోత్సవ పోటీల్లో పాటల పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 15న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని వెల్లడించారు. అభినందించిన వారిలో ప్రిన్సిపాల్ అండెం కర్ణాకర్‌రెడ్డి, జగదీశ్వర్, వెంకటేశ్వర్లు, వీరాచారి, మేడి రమేష్, బొనగాల రమేష్, బాలరాజు, చేరాలు ఉన్నారు.

‘చలో హైదరాబాద్’కు తరలిన మాదిగలు



నినాదాలు చేస్తున్న మాదిగలు

సంగెం/పర్వతగిరి: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై కేంద్రం ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్‌కు మాదిగలు తరలివెళ్లారు. మండలంలోని నల్లబెల్లి గ్రామం నుంచి ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో శనివారం మాదిగల విశ్వరూప మహాసభకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో కట్ల అశోక్, మామిడాల మురళీమోహన్, రవీందర్, పాణి ప్రభాకర్, కుమార్, శ్రీకాంత్, ఉపేంద్రం, సుమలత, కట్ల సంజీవ, రాణి, సుప్రియ, రజిత, యశోద, యాకూబ్ పాల్గొన్నారు. పర్వతగిరి మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జిల్లా ధర్మయ్య ఆధ్వర్యంలో పూలమాల వేసి విశ్వరూప మహాసభకు తరలి వెళ్లారు. దర్గస్వామి, దేవేందర్, చిన్నవెంకటేశ్వర్లు, యాకయ్య, శ్రీనివాస్, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘కాట్రపల్లి సర్పంచ్ కాంగ్రెస్‌లోకి వద్దు’



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రాయపర్తి: ఎంతో కష్టపడి గెలిపించిన తమకు అన్యాయం చేస్తూ కష్టకాలంలో కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరిన సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య తిరిగి లబ్ధికోసం కాంగ్రెస్‌లో చేరడాన్ని స్వాగతించబోమని ఆ గ్రామ కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కాట్రపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ గ్రామ పార్టీ గౌరవ అధ్యక్షుడు కుందూరు జయపాల్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు రాపాక సోమయ్య మాట్లాడారు. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు కష్ట పడిన ఏ ఒక్క కార్యకర్తను కాదని ఆయన పార్టీ మారారని దీంతో అతన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. పాలకుర్తిలో జరిగిన సభలో పార్టీ కండువా కప్పుకుని తాను పార్టీలో చేరినట్లు సామాజిక మాధ్యమాల్లో పెట్టుకోవడం విచారకరం అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కందుకూరి భిక్షపతి, వార్డు మెంబర్లు సంధ్య, నరేష్, చిన్నపాక రాజశేఖర్, స్వప్న, నాగేష్, మహేష్, సతీష్, గుండ్ల పల్లి మధు, ఎండీ నాసర్, ఫకీర్, నారాయణ, భీమయ్య, ఖాజామియా, యాకుబ్, సోమయ్య, చిట్యాల యాకయ్య, నరేష్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ధర్మగుణం కలిగి ఉండాలి



అనఘాష్టమి వ్రతం నిర్వహిస్తున్న వేదపండితులు

హన్మకొండ కల్చరల్: ప్రతిఒక్కరూ ధర్మగుణం కలిగి ఉండాలని దత్తపీఠ ఉత్తరాధిపతి దత్త విజయానంద తీర్థస్వామిజీ ఉద్బోధించారు. దీపావళి వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం ములుగురోడ్డులోని వరద దత్తక్షేత్రంలో స్వామిజీ ఆధ్వర్యంలో వేద పండితులు విశేష పూజలు, వెయ్యిమంది భక్తులతో సామూహిక అనఘాష్టమి వ్రతం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాల వితరణ చేశారు. కార్యక్రమంలో దత్తక్షేత్రం ట్రస్ట్ సభ్యులు వైవీ.వామన్‌రావు, శివరామకృష్ణ ప్రసాద్, వెంకటేశ్వర్లు, డాక్టర్ లక్ష్మినారాయణ, డాక్టర్ శార్వాణి, శివకుమార్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం 10గంటలకు సూక్తయాగం, సాయంత్రం 6గంటలకు ధనలక్ష్మి పూజ జరుగుతుందని ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

దాతృత్వం



వైద్య సేవలను పరిశీలిస్తున్న ఫణీ

ఖిలా వరంగల్: ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ యువకుడు మతిస్థిమితం కోల్పోయి దూపకుంట రోడ్డులోని నిర్జన ప్రదేశంలో పడిపోయి కనిపించాడు. పంట పొలాల చాటున మూడు రోజులుగా తిండి, తాగునీరు లేక నీరసంగా పడిఉన్న ఆ వ్యక్తి స్థానిక రైతులు కంటపడ్డాడు. ఈ విషయాన్ని స్థానిక సామాజిక కార్యకర్త ఎండీ.ఫణీకి శనివారం తెలిపారు. ఆ వ్యక్తి వద్దకు ఫణీ చేరుకుని భోజనం, తాగునీరు అందజేసి, అనంతరం చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

‘బీఆర్ఎస్, బీజేపీని ఎండగడదాం’

గూడూరు: నియంత పాలన సాగిస్తున్న బీఆర్ఎస్, ఫాసిస్టు స్వభావంతో విద్వేశాలను రెచ్చగొడుతున్న బీజేపీ పార్టీలను ఎండగట్టాలని టీపీజేఏసీ డివిజన్ నాయకుడు మైస శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం టీపీజేఏసీ బీఆర్ఎస్, బీజేపీ పాలనలకు అంతం పలకాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుకున్న యువత కేసీఆర్ మాటలకు మోసపోవద్దన్నారు. అదే విధంగా బీజేపీ మతతత్వ పార్టీకి మొగ్గు చూపరాదన్నారు. ఈ రెండు పార్టీలను ఓడించగలిగిన సత్తా ప్రజలకు ఉందని, ప్రజా తీర్పును శిరసావహించే వ్యక్తులను ఎన్నుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ అభ్యర్థి వేధింపులతోనే బీఆర్ఎస్‌లోకి..



వర్ధన్నపేట: బీఆర్ఎస్‌లో చేరిన వారితో అరూరి



హసన్‌పర్తి: మాట్లాడుతున్న అరూరి రమేష్

- నియంతలా వ్యవహరిస్తున్న నాగరాజు
- బీఆర్ఎస్ వర్ధన్నపేట అరూరి రమేష్

వర్ధన్నపేట: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కేఆర్ నాగరాజు నియంతలా వ్యవహరిస్తూ.. కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేయడంతో బీఆర్ఎస్‌లో చేరుతున్నారని వర్ధన్నపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. శనివారం మండలంలోని నల్లబెల్లికి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జక్కి శ్రీకాంత్ నాయకత్వంలో 250 మంది వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలు రమేష్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ నేడు పార్టీ కార్యకర్తలనే విస్మరించే వాడు రేపు ఎన్నికల్లో గెలిస్తే నాగరాజు ప్రజలను ఎన్ని ఇబ్బందులకు గురి చేస్తాడో ప్రజలు గమనిస్తున్నారన్నారు. మూడోసారి గెలిపించాలని, మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించాడని, మండలాధ్యక్షునిగా ఉన్న తనపై అక్రమ కేసులు బనాయించిన ఘనుడు కేఆర్ నాగరాజు అని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడిగా రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరిన శ్రీకాంత్ అన్నారు. ఎస్సై స్థాయి నుంచి ఐపీఎస్ స్థాయి వరకు ఎదగడానికి ఎంతమంది సామాన్యులను బలి చేశారో ప్రజలందరికి తెలుసన్నారు. డీసీసీబీ చైర్మన్ రవీందర్ రావు, జెడ్పీటీసీ భిక్షపతి, మున్సిపల్ చైర్ పర్సన్ అరుణ, వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కుమారస్వామి, తుమ్మల యాకయ్య, సిలువేరు కుమారస్వామి పాల్గొన్నారు.

నక్సల్స్‌ను పొట్టనపెట్టుకున్నవాడికి పవర్ ఇస్తామా?

హసన్‌పర్తి: నక్సల్స్ బిడ్డలను పొట్టనపెట్టుకున్న వాడికి పవర్ ఇస్తామా.. అని వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేష్ ప్రశ్నించారు. నగరంలోని 65వ డివిజన్‌తోపాటు మడిపల్లి, మనిపల్లి, హసన్‌పర్తికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పార్టీ సీనియర్ నాయకుడు చుంచు రవి ఆధ్వర్యంలో రమేష్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ దేవన్నపేటకు చెందిన పలువురు నక్సల్స్ సానుభూతిపరులు కాంగ్రెస్ అభ్యర్థి నాగరాజు బాధ్యతులేనన్నారు. ప్రతి కార్యకర్త గెలుపునకు కృషి చేయాలని కోరారు. 65వ డివిజన్‌లో దాదాపు బీజేపీ క్యాడర్ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కో–ఆర్డినేటర్ ఎల్లావుల లలితా యాదవ్, మండలాల కో–ఆర్డినేటర్ అంచూరి విజయ్, కార్పొరేటర్ దివ్యారాణి, ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ రేణుకుంట్ల సునీత, వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, ఆత్మ డైరెక్టర్ భూపాల్‌రెడ్డి, మాజీసర్పంచ్‌లు చుంచు రవి, వాసుదేవారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్, బండి రజనీకుమార్, పిట్టల కుమారస్వామి, మైకేల్, పీఏసీఎస్ చైర్మన్ జక్కు రమేష్, విజేందర్, సుభాష్ పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో మాస శివరాత్రి పూజలు



రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఐనవోలు: మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమంతో పాటు స్వామివారికి కల్యాణం జరిపించారు. అలాగే ఒగ్గు పూజారులచే పట్నం వేశారు. ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్‌శర్మ, వేద పండితుడు విక్రాంత్ వినాయక్‌జోషి, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య శిబిరం

ధర్మసాగర్: మండలంలోని సాయిపేట గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం గ్రామంలోని వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటీస్ సీనియర్ సిటిజన్స్, భారత ప్రభుత్వ సహకారంతో 60 సంవత్సరాలు పైబడిన వయో వృద్ధులకు ఇంటి వద్దనే సేవలను అందించేందుకు హనుమకొండ రెడ్ క్రాస్ సంచార వైద్యశాల వారు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ నెల గ్రామంలో క్యాంపు నిర్వహించి వృద్ధులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించటం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వివిధ పార్టీల్లో చేరికలు



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో మాధవరెడ్డి



దుగ్గొండి: శ్రీనివాస్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన తొగర్రామయ్యపల్లి వాసులు



బీజేపీలో చేరిన వారితో నాయకులు

నర్సంపేట: తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు నియంత పాలన నుంచి విముక్తి కోరుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవ రెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 4, 5వార్డుల్లో 200కుటుంబాలు శనివారం దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఖానాపురం: బుధరావుపేటకు చెందిన జేఏసీ బాధ్యులు రజనికాంత్, మల్లేష్, సర్దార్‌లతో పాటు పలువురు కాంగ్రెస్ అభ్యర్థి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

గీసుకొండ: ఎలుకుర్తిహవేలికి చెందిన ఉపసర్పంచ్ భూసాని సునీతరాజు శనివారం సాయంత్రం కాంగ్రెస్ పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినట్లు ఎంపీపీ బీమగాని సౌజన్య తెలిపారు. ఆమెతో పాటు బోయిని స్వామి, భూసాని రఘుపతి, మహేందర్, నాగరాజు, సురేశ్ తదితరులు కాంగ్రెస్‌లో చేరినట్లు ప్రకటించారు.

చెన్నారావుపేట: పాత మగ్దుంపురం, ఉప్పరపల్లి, చెన్నారావుపేటకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, దివ్యాంగుల సంఘం నాయకులు, హమాలీలు శనివారం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

దుగ్గొండి: వెంకటాపురం గ్రామానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు ఊరటి రాజిరెడ్డి, లింగం, గుండెబోయిన సాంబయ్య ఆధ్వర్యంలో పలువురు మాధవరెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు.

వర్ధన్నపేట: వర్ధన్నపేట పిరంగిగడ్డకు చెందిన వడ్డెర సామాజిక వర్గానికి చెందిన బొంత రంగనాథ్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన వారు 100 మంది కేఆర్ నాగరాజు, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు.

బీఆర్ఎస్‌లో చేరిక

వరంగల్: నగరంలోని 14వ డివిజన్ ఇందిరమ్మ నగర్ –1కు చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు అడప లింగమూర్తి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో శనివారం చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి రాష్ట్ర నాయకుడు ఈగ మల్లేశం ఆహ్వానించారు.

దుగ్గొండి: తొగర్రామయ్యపల్లి గ్రామానికి చెందిన పల్లె రామన్న, పొగాకు మోహన్, సూదుల రవీందర్‌రెడ్డిలు కాంగ్రెస్‌పార్టీకి రాజీనామా చేసి జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, నర్సంపేట మార్కెట్ చైర్మన్ పొన్నం మొగిలి, రైతుబంధు మండల కోఆర్డినేటర్ నర్సింహారెడ్డిల సమక్షంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు.

బీజేపీలో భారీగా చేరికలు

సంగెం: బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు బీజేపీలో చేరినట్లు మండల పార్టీ అధ్యక్షుడు బుట్టి కుమారస్వామి తెలిపారు. లోహిత, గవిచర్ల గ్రామానికి చెందిన పలువురు బీజేపీ పరకాల అభ్యర్థి కాళీప్రసాదరావు సమక్షంలో బీజేపీలో చేరారు. రమణ, కరుణాకర్, రాజు పాల్గొన్నారు.

ఆరుగురిపై కేసు

శాయంపేట : మండలంలో రోడ్లపై జులాయిగా తిరుగుతున్న ఆరుగురిపై టౌన్ న్యూసెన్స్ యాక్ట్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై దేవేందర్ శనివారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన శివరాత్రి శివరాం, గోవింద్ సృజన్, భోగి అవినాష్, మాస్కుల రాజ్‌కుమార్, మారెపల్లి కార్తిక్, ఉప్పు విష్ణు స్థానిక జీవన్‌నగర్ కూడలి వద్ద శుక్రవారం అర్ధరాత్రి మద్యం సేవించి ద్విచక్రవాహనాల హారన్లు మోగిస్తూ న్యూసెన్స్ చేస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా రెండు ద్విచక్ర వాహనాలతో పాటు ఆరుగురు వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. సదరు వ్యక్తులపై టౌన్ న్యూసెన్స్ యాక్ట్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామ కూడలిలో యువకులు గుంపులుగా చేరి రోడ్డుపై వెళ్లే వారికి ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.